క్లుప్తంగా

సత్ప్రవర్తనతో నడుచుకోవాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ నాగార్జున

పగిడ్యాల: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున సూచించారు. ఆదివారం ముచ్చుమర్రి స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నెల నెలా రౌడీషీటర్ల ప్రవర్తనపై రిపోర్ట్ పంపాల్సి ఉంటుందని.. ఎలాంటి గొడవలకు, అల్లర్లకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో నడుచుకుంటే షీట్ తొలగింపునకు కూడా సిఫారసు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. స్టేషన్‌కు ఎప్పుడు పిలిచినా హాజరు కావాలని, లేదంటే చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరి కదలికలపై నిఘా ఉంటుందన్నారు. పోలీసుల ఆదేశాలను ఎవరు ఉల్లంఘించినా క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కృష్ణుడు, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

పాములపాడు: నంద్యాలను కరువు జిల్లాగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు రామేశ్వరరావు కోరారు. ఆదివారం మండలంలోని రుద్రవరం గ్రామంలో పలురకాల పైర్లను ఏపీ రైతు సంఘం జిల్లా బృందం పరిశీలించింది. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన కొద్దిపాటి వర్షాలకు రైతులు విత్తనాలు వేశారన్నారు. ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోయాయన్నారు. పెట్టుబడుల రూపంలో వేలల్లో ఖర్చు చేశారని, పంట చేతి కందే పరిస్థితి లేకపోవడంతో నష్టపోయారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వరరావు, వీరన్న, హనుమంతు, రైతులు సురేష్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న బీజేపీని గద్దెదింపాలి

ఆత్మకూరు: కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో పార్టీ డివిజన్ స్థాయి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అప్రజాస్వామ్య విధానాలను అవలంభిస్తున్న బీజేపీ పార్టీని గద్దె దించాలని, కార్పొరేట్లకు అనుగుణంగా వ్యవహించి పేద ప్రజలను ఆర్థికంగా దెబ్బతీస్తుందని చెప్పారు. కులం, మతం పేరుతో ప్రజల మధ్య వివాదాలను చెలరేపుతూ ఘర్షణకు పాల్పడడం విషాదకరమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ కార్యదర్శి రణధీర్, మండల కార్యదర్శి నరసింహానాయక్, వెంకటేశ్వరావు, రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

నందికొట్కూరు: విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ఏబీవీపీ ఉద్యమాలు చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర నాయకులు భానుప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏబీవీపీ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ పట్టణ కార్యదర్శిగా యేవంధర్‌గౌడు, నగర సహాయ కార్యదర్శిగా శ్రీను, ఉపాధ్యక్షులుగా రేవంత్, రఘులను ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యార్థులందరూ సామాజిక సేవలలో భాగస్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో ఏబీవీపీ జిల్లా విభాగ్ ప్రముఖ స్వామి, బాగ్ కన్వీనర్ హరినాథ్, శశి, వాసు, శివుడు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు



14వ వార్డులో జేసీబీతో కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: పట్టణంలో 14వ వార్డులో పెరిగిపోయిన కంపచెట్లను జేసీబీతో తొలగించేందుకు ఆదివారం కౌన్సిలరు మనపాడు అశోక్ చర్యలు చేపట్టారు. వార్డులో కంపచెట్లతో పాటు పిచ్చి మొక్కలు తొలగించి విషపురుగుల బెడద నుంచి, దోమల నుంచి ప్రజలను రక్షించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

వెలుగోడు: ఆత్మకూరు–వెలుగోడు ప్రధాన రహదారిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు తెలిపిన మేరకు వివరాలు ఇలా.. పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ పాఠశాల కరస్పాండెంట్ ఇమ్మానుయేలు కుమారుడు మద్దెల జోసఫ్ వ్యక్తిగత పనుల నిమిత్తం ఆత్మకూరుకు స్కార్పియో వాహనంలో వెళ్లి తిరిగి వస్తుండగా వెలుగోడు నుంచి ఆత్మకూరుకు సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొట్టింది. దీంతో జోసఫ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ షాషావలి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల ఆదాయం ఏమైనట్టు?

- తూడిచెర్ల గ్రామంలోని ఆలయాలకు 48.54 ఎకరాల మాన్యం
- వేలాల ద్వారా ఏటా రూ.లక్షల్లో ఆదాయం
- ఆలయాల అభివృద్ధిని పట్టించుకోని అధికారులు
- భూముల ద్వారా వచ్చిన ఆదాయం ఏమవుతోందని ప్రశ్నిస్తున్న భక్తులు



శ్రీశంకరమల్లయ్యస్వామి ఆలయం



పగుళ్లిచ్చి అప్పుడో ఇప్పుడో కూలేందుకు సిద్ధంగా ఉన్న గోడల మధ్యలో ఉన్న లింగమయ్యస్వామి



దాతలు ఏర్పాటుచేసిన తాగునీటి ట్యాంకు

జూపాడుబంగ్లా : ఏటా మాన్యం భూముల వేలాల ద్వారా వచ్చే ఆదాయంతో ఆలయాలను అభివృద్ధి చేయాల్సిన దేవదాయశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయాల్లో దాతల సహకారంతోనే అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఏటా మాన్యం భూముల వేలం పాటల సందర్భంగా లెక్కలు బహిర్గతం చేయాలని భక్తులు కోరుతున్నా అధికారులు వెల్లడించిన దాఖలాల్లేవు. దీంతో ఆదాయాన్ని అధికారులే దిగమింగుతూ దేవాలయాల అభివృద్ధిని విస్మరించి ఏకంగా దేవుళ్లకే శఠగోపం పెడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఏటా రూ.లక్షల ఆదాయం ఉన్నా

మండలంలోని తూడిచెర్ల గ్రామంలోని శ్రీశంకర మల్లేశ్వరస్వామి, లింగమయ్య, వీరభద్ర, ఆంజనేయ స్వామివార్లకు 48.54 ఎకరాల మాన్యం భూములున్నాయి. వాటిని వేలం వేయడం ద్వారా ఏటా రూ.7నుంచి రూ.9లక్షల ఆదాయం సమకూరుతుంది. అందులో లింగమయ్య స్వామికి ప్రత్యేకంగా 9.74ఎకరాల భూములున్నాయి. ఈ భూములను వేలం వేయగా మూడేళ్ల క్రితం రూ.5,45,200 నిధులు సమకూరగా రెండేళ్ల క్రితం రూ.6,37,800 ఆదాయం వచ్చింది. ఈ ఏడాది రూ.9.22లక్షలు వచ్చాయి. మాన్యం భూముల వేలం ద్వారా సమకూరిన నిధులతో కనీసం దేవాలయాల్లో ఎలాంటి అభివృద్ధి చేయకపోగా వచ్చిన రూ.లక్షల నిధులను అధికారులు కైంకర్యం చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.

నైవేద్యానికి నోచుకోని లింగమయ్యస్వామి

లింగమయ్యస్వామి మాన్యం భూములు 9.74 ఎకరాలను వేలం వేయగా ఏటా రూ.లక్ష ఆదాయం వస్తున్నా ఇప్పటిదాకా స్వామివారు దేవాలయ నిర్మాణానికి నోచుకోలేదు. నాలుగేళ్ల క్రితం వరకు చెట్ల కింద ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉండటంతో పాటు పశువులు, కుక్కలు తదితరాలు స్వామివారిని ఆనుకొని వెళ్తూ అపరిశుభ్రం చేస్తుండేవి. దీంతో భక్తులు ఆందోళన చేయగా దేవదాయశాఖ వారు కేవలం రూ.70వేలతో స్వామి వారి చుట్టూ గోడకట్టి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం స్వామివారి చుట్టూ కట్టిన ప్రహరీ గోడ కూడా బీటలు వారి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికి కుడా స్వామివారు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూనే ఉన్నారు. దీనికితోడు పండుగ పూటకూడా స్వామివారు నైవేద్యానికి నోచుకోవడం లేదు.

దాతల సహకారంతోనే అభివృద్ధి

410 ఏళ్ల క్రితం తూడిచెర్ల గ్రామ సమీపంలో ఉన్న అగ్రహారంలో వెలసిన శ్రీశంకరమల్లేశ్వరస్వామి వారంటే ఎంతో ప్రసిద్ధి స్వామివారికి 24.48ఎకరాల మాన్యం భూములున్నాయి. వాటిని వేలం వేయగా ఏటా రూ.5.75లక్షల ఆదాయం వస్తుంది. అయినా దేవాలయం అభివృద్ధి విషయమై దేవదాయశాఖ అధికారులు పట్టించుకోకపోవడంలేదు. స్వామివారి సన్నిధిలో ఏటా వందల సంఖ్యలో వివాహ వేడుకలు జరుగుతుంటాయి. వేడుకలకు వచ్చే భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, సత్రాల్లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విషయాన్ని గ్రహించిన తూడిచెర్ల గ్రామస్తులు దాతల సహకారంతో దేవాలయం ఆవరణలో బోరును తవ్వించి తాగునీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. పూజారికి నివాసగృహం నిర్మించి, కాశీరెడ్డి నాయన నిత్యాన్నదానాన్ని స్థాపించారు. మాన్యం భూముల వేలం ద్వారా సమకూరుతున్న నిధులను దేవదాయశాఖ అధికారులు ఏమిచేస్తున్నారో బహిర్గతం చేయాలని భక్తులు ఏటా కోరుతున్నా అధికారులు లెక్కలు చూపించకుండా తప్పించుకోవటంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దాతలసహకారంతోనే అభివృద్ధి పనులు



దేవాలయాల మాన్యం భూములు వేలం వేయడం ద్వారా ఏటా రూ.8నుంచి రూ.9లక్షలు సమకూరుతున్నాయి. ఈ నిధులను దేవదాయశాఖ అధికారులు ఏమి చేస్తున్నారో వెల్లడించాలని ఏటా కోరుతున్నా వారు లెక్కలు బహిర్గతం చేయడం లేదు. ఏళ్లు గడుస్తున్నా శ్రీశంకరమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద దేవదాయశాఖ అధికారులు ఇప్పటిదాకా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. కేవలం దాతల సహకారంతోనే పనులు జరుగుతున్నాయి.

– పుల్లన్నయాదవ్, తూడిచెర్ల

పూర్వం నుంచి గుడులు ఎలావుంటే అలానే ఉంటాయి

పూర్వం నుంచి దేవాలయాలు ఎలా ఉంటే అలానే ఉంటాయి. మాన్యం భూముల ద్వారా వచ్చే ఆదాయంలో 18 శాతం కాంట్రిబ్యూషన్ పోగా నెలకు రూ.7,500లను వేతనాలకు, పడితరానికి ఇస్తున్నాం. ఇంక ఏమి మిగులుతుంది. మిగిలినదాంట్లో శివరాత్రి, శ్రీరామనవమి వేడుకలకు ఖర్చుచేస్తున్నాం. రూ.5లక్షల్లోపు ఆదాయం ఉన్న ఆలయాలు త్వరలో పూజారుల హస్తగతం అవుతున్నాయి. అభివృద్ధి చేయాలని భక్తులు కోరితే ఇంజినీర్‌ను పిలిపించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం.

– జనార్దన్‌శెట్టి, ఈఓ, దేవదాయశాఖ

వైద్య శిబిరం నుంచి 9 మంది డిశ్చార్జ్

వెలుగోడు: రేగడగూడురు గ్రామంలో అతిసార బాధితుల కోసం వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నారు. ఆదివారం 9 మందిని వైద్యాధికారులు మెడికల్ క్యాంపు నుంచి డిశ్చార్జ్ చేశారు. మరో 10మందిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేసినట్లు వేల్పనూరు పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు తెలిపారు. మరో మూడు కేసులు కొత్తగా నమోదు అయినట్లు ఆయన వెల్లడించారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామ సచివాలయం-1, 2 పరిధిలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నియోజకవర్గ ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరుకావాలని పేర్కొన్నారు.

కేసీ రైతులు త్వరగా నీరు పారించుకోండి

జూపాడుబంగ్లా: కర్నూలు–కడప కాల్వ ఆయకట్టు రైతులు సాగుచేసిన పొలాలకు త్వరగా సాగునీటిని పారించుకోవాలని ఏఈ నరేష్ సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మల్యాల ఓ పంపు ద్వారా 335, ముచ్చుమర్రి ఓ పంపు ద్వారా 245 క్యూసెక్కుల చొప్పున కేసీ కాల్వకు సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పొలాలకు సాగునీటిని పారించుకోగా లాకిన్స్‌లా వరకు 300 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు తెలిపారు. ఈ నీటిని తూడిచెర్ల సబ్ ఛానల్ కాల్వకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో లేకపోవడంతో నీటిమట్టం తగ్గిపోతోందని, ఎత్తిపోతల పథకాల నుంచి మరో పది రోజుల వరకు కేసీ కాల్వకు నీరు సరఫరా చేసే అవకాశాలున్నాయని తెలిపారు.

ప్రతి పేదవానికి గృహభాగ్యమే ధ్యేయం



రిబ్బన్ కట్ చేసి గృహనిర్మాణాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా సెక్రటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి

జూపాడుబంగ్లా: ప్రతి పేదవానికి గృహవసతి కల్పించడమే జగనన్న ధ్యేయమని వైఎస్సార్‌సీపీ జిల్లా సెక్రటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని తాటిపాడు గ్రామంలోని జగనన్నకాలనీలో జి.రమణమ్మ నిర్మించుకున్న పక్కాగృహాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో సంక్షేమ పథకాల మంజూరులో మహిళలకు పెద్దపీట వేశారన్నారు. ఎలాంటి రెకమెండేషన్, పైసా ఖర్చులేకుండా అర్హతను ప్రామాణికంగా తీసుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన మంజూరు చేసిన సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లాయర్ చంద్రశేఖర్‌రెడ్డి, సదాశివారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంటు లింగన్న, శ్రీనివాసులు రజక, సుబ్బరాయుడు రజక తదితరులు పాల్గొన్నారు.

కుంగిన కేసీ కాల్వ గట్టు



97.500 కిలోమీటరు ఫారం తూము వద్ద కుంగిన కేసీ కాల్వ కట్ట

జూపాడుబంగ్లా: 97.500కిలో మీటరు (ఫారం తూము) వద్ద కేసీ కాల్వ కుడిగట్టు కుంగిపోయింది. టీడీపీ ప్రభుత్వ పాలనలో తూముకు మరమ్మతులు నిర్వహించిన అనంతరం కట్టను పూర్తి స్థాయిలో పటిష్టం చేయలేదు. దీంతో ఫారం స్లూయిస్ (తూము)వద్ద కట్టకుంగిపోగా అప్పట్లో కేసీ కాల్వ అధికారులు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం అదే ప్రాంతంలో మళ్లీ కట్టకుంగిపోయి ప్రమాదకరంగా ఉంది. అధికారులు పట్టించుకోకపోతే కట్ట తెగిపోయి నీరు వృథా అయ్యే అవకాశం ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం వాటిల్లకముందే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం




సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

వెలుగోడు: పట్టణంలోని 2వ సచివాలయం పరిధిలో సీసీ రోడ్డు పనులను ఆదివారం సర్పంచ్ వేల్పుల జయపాల్, వైఎస్ఆర్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి కే.రామ్మోహన్ రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఇటీవల ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పట్టణంలోని రెండో సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంగబాయి వీధికి చెందిన ప్రజలు తమ ప్రాంతంలో అంతర్గత సీసీ రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే వెంటనే స్పందించి సీసీ రోడ్డుకు నిధులు మంజూరు చేయించారు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన కేంద్ర విశ్వవిద్యాలయ నిర్మాణంపై హర్షం

నంద్యాల(అర్బన్): ఏపీలో గిరిజన కేంద్ర విశ్వవిద్యాలయానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడంపై ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మన్యం జిల్లాలోని చిన్నమేడలపల్లి వద్ద కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం అభినందనీయమన్నారు. సీఎం జగనన్న గిరిజనుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని చెప్పడానికి గిరిజన విశ్వవిద్యాలయ నిర్మాణమే నిదర్శనమన్నారు. ప్రతిష్టాత్మక కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కృషి చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గిరిజనులు ఎన్నటికి మరువలేరని కొనియాడారు.

బానకచెర్ల నుంచి 5వేల క్యూసెక్కుల నీటి విడుదల



బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి విడుదలవుతున్న నీరు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి ఆదివారం 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరు నుంచి బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరుకు 5000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందన్నారు. ఇక్కడి నుంచి జీఎన్ఎస్ఎస్‌కు 3000 క్యూసెక్కులు, కేసీసీ కి వెయ్యి క్యూసెక్కులు, తెలుగుగంగ(వీబీఆర్)కు1000 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని వివరించారు.

లాకిన్స్‌లా వద్దకు 300 క్యూసెక్కులు

మండలంలోని కేసీ కెనాల్ 120వ కిలో మీటరు లాకిన్స్‌లా వద్దకు 300 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని ఏఈ శ్రీనివాసనాయక్ ఆదివారం తెలిపారు. శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను మల్యాల ఎత్తిపోతల పథకం ఒక పంపు ద్వారా 340 క్యూసెక్కుల నీరు విడుదలవుతోందని, అలాగే ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ఒక పంపు ద్వారా 250 క్యూసెక్కుల చొప్పున కృష్ణా జలాలను కేసీ కెనాల్‌లోకి విడుదలవుతోందని వివరించారు. కాగా లాకిన్స్‌లా వద్దకు చేరుతున్న 300క్యూసెక్కుల నీటిని తూడిచెర్ల ఎస్కేప్ ఛానల్‌కు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

గ్రామాల అభివృద్ధికి సీఎం జగన్ కృషి

- ఎథిక్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- రూ. 20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం
- సూపరింటెండెంట్ సతీమణికి కారుణ్య నియామకపత్రం అందజేత



అన్నెం లక్ష్మీదేవికి నియామకపత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యే శిల్పా

మహానంది: గ్రామాల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. ఆదివారం మహానంది విచ్చేసిన ఆయన ఇటీవల మృతి చెందిన ఆలయ సూపరింటెండెంట్ అన్నెం ఈశ్వర్‌రెడ్డి సతీమణి అన్నెం లక్ష్మీదేవికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పిస్తూ నియామకపత్రం అందజేశారు. అలాగే మహానందిలో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని, ఎస్‌వీఆర్ కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కొమ్మా మహేశ్వరరెడ్డి, సర్పంచ్ శిరీష, ఎంపీటీసీ బంగి వెంకటేశ్వర్లు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శరభారెడ్డి, నాయకులు ఒంటెద్దు వీరారెడ్డి, కొండా మధుసూదన్‌రెడ్డి, జయసింహారెడ్డి, అవుతు సాంబిరెడ్డి, గజ్జా పెద్దపక్కీరయ్య, భూమా సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామా రూఫ్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి కో ఆప్షన్‌సభ్యులు, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు హాజరుకావాలన్నారు.

కనులపండువగా వీరభద్రస్వామి కల్యాణోత్సవం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల మండలం పోలూరు గ్రామంలో వెలసిన శ్రీవీరభద్ర దేవస్థానంలో శ్రావణమాసం ఏకాదశిని పురస్కరించుకొని ఆదివారం లోక కల్యాణం కోసం శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి 12వ కల్యాణోత్సవం కనుల పండువగా శశిభూషణ సిద్ధాంతి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే భద్రకాళి మాత, వీరభద్ర స్వామి మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పట్టువస్త్రాలతో వధూవరులుగా ముస్తాబు చేసి కల్యాణ తంతు జరిపించారు.

మహానందిలో భక్తజన సందడి



మహానందీశ్వరుడి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు



సంప్రదాయంలో భాగంగా గుర్రంపై వస్తున్న వరుడు

మహానంది: మహానంది ఆలయం ఆదివారం భక్తజనసందడిగా మారింది. శ్రావణమాసం, సెలవురోజు, ఏకాదశి కలిసి రావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఉదయం అష్టవిధ మహా మంగళ హారతుల సమయం నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవారి దర్శనం రాత్రి ఏకాంత సేవ పూజల వరకు నిర్విరామంగా కొనసాగింది. భక్తులరద్దీకి అనుగుణంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్లు ఓంకారం వెంకటేశ్వరుడు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్ బాబు ఏర్పాట్లు చేశారు. శ్రావణమాసం కావడంతో ఆలయ ప్రాంగణంలో సుమారు ఇరవైకి పైగా పెళ్లిళ్లు జరిగాయి. నూతన వధూవరులు, బంధుమిత్రులు స్వామి,అమ్మవారిని దర్శించుకుని పూజలు చేపట్టారు. ఆర్జిత సేవాటికెట్లు, వివిధ విభాగాల ద్వారా సుమారు రూ. 5లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు అధికార వర్గాలు తెలిపాయి.








బండినాయునిపాలెం వద్ద ప్రవహిస్తున్న శివభాష్యం సాగర్ ప్రాజెక్ట్ పంటకాల్వ, వీరాపురం వద్ద పొలాల్లో నిలిచిన నీరు, వరిపైరుకు ఎరువు చల్లుతున్న రైతు

వరిసాగులో రైతన్నలు బిజీ

- చెరువుల నుంచి పొలాలకు నీటి విడుదల
- శివభాష్యం ప్రాజెక్ట్‌ద్వారా 1200 క్యూసెక్కుల నీటి సరఫరా
- పొలాల్లో నిలిచిన సాగునీరు

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో ఎక్కువగా ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పత్తి, మినుము, పెసర, కంది పంటలు సాగు చేసుకుంటున్నారు. కాగా మండలంలోని గుమ్మడాపురం, శివపురం, బావాపురం, కొత్తపల్లి, గువ్వలకుంట్ల గ్రామాలలో సుమారు 960 హెక్టార్లలో ఆయకట్టు కింద రైతులు వరి పంటలను వేసుకున్నారు. ఇందులోనూ ఎక్కువగా గువ్వలకుంట్ల గ్రామంలోనే 600 హెక్టార్లు, కొత్తపల్లిలో 160 హెక్టార్లు వరి పైర్లను సాగుచేశారు. అయితే గత నెల రోజులుగా వర్షాలు పడకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. దీంతో రైతులలో పంటలు దెబ్బతింటున్నాయన్న ఆందోళన నెలకొనడంతో నీటి సంఘాల ఆధ్వర్యంలో బైరప్ప చెరువు, సర్వారెడ్డి చెరువుల తూముల ద్వారా పంట పొలాలకు సాగునీటిని విడుదల చేశారు. అదేవిధంగా నల్లమల అటవీ ప్రాంతంలోని శివభాష్యం సాగర్ ప్రాజెక్ట్ ద్వారా ఈనెల 10వ తేదీ నుంచి నీటివిడుదల జరుగుతోంది. ఇప్పటిదాకా ప్రాజెక్ట్‌ద్వారా 1200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేశారు. ఈ నీటిని రైతులు పొలాలకు పారించుకొంటున్నారు. దీంతో పొలాల్లో ఎటువైపుచూసిన రైతులు, కూలీలు వ్యవసాయ పనులు చేస్తూ కనిపిస్తున్నారు. కలుపునివారణ, నారు నాటడం, మందులు పిచికారీ చేయడం, రసాయన ఎరువులు చల్లడం వంటి పనుల్లో బిజీగా ఉన్నారు.



బండినాయుని పాలెం సమీపంలో పంటపొలాల్లో కలుపు తీస్తున్న కూలీలు



పాలెంచెరువు గూడెం సమీపంలో వరి నాటు వేస్తున్న దృశ్యం